వైద్యం అంతంత మాత్రమే..!

ఏ ప్రభుత్వమైనా ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తుంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రభుత్వాసుపత్రుల రూపురేఖలను మార్చి ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించింది. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేదలకు వైద్యం అందని ద్రాక్ష అవుతోంది. దీనిపై శుక్రవారం పలమనేరు నియోజకవర్గంలో సాక్షి పలు ఆస్పత్రులను విజిట్ చేసింది. అక్కడి తిష్ట వేసిన సమస్యలను గుర్తించింది.

- పీహెచ్‌సీల్లో పడకేసిన పారిశుధ్యం
- కొలమాసనపల్లె ఆస్పత్రిలో అందుబాటులో ఉండని డాక్టర్లు
- పలు ఆస్పత్రుల్లో సిబ్బంది కొరత
- ఓపీ సేవలు తగ్గుముఖం
- ప్రజారోగ్యంపై దృష్టి సారించని కూటమి ప్రభుత్వం
- ఇదీ పలమనేరు నియోజకవర్గంలో ఆస్పత్రుల పరిస్థితి

పలమనేరు: పలమనేరు నియోజవర్గంలో ఆస్పత్రుల్లో వైద్యసేవలు అంతంత మాత్రంగానే ఉంటున్నాయని సాక్షి పరిశీలనలో తేలింది. ఆస్పత్రుల్లో వైద్యులు అందుబాటులో లేకపోవడంతో సిబ్బందే ఓపీని చూడాల్సి వస్తోంది. దీనికి తోడు ఆస్పత్రుల్లో సిబ్బంది కొరత వేధిస్తోంది. ముఖ్యంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సమావేశాలు ఏర్పాటు చేసి ప్రజలకు చెప్పే వైద్య శాఖ ఆస్పత్రుల వద్ద తిష్ట వేసిన పారిశుధ్యం సమస్యలపై మాత్రం దృష్టి సారించడం లేదు.

నియోజకవర్గంలో మొత్తం పీహెచ్‌సీలు:8

పలమనేరు మండలంలో కొలమాసనపల్లె, బైరెడ్డిపల్లె మండలం కేంద్రం, తీర్థం, వీకోట మండలంలో ఓగు, గంగవరం మండల కేంద్రం, పత్తికొండ, పెద్దపంజాణి మండల కేంద్రంతోపాటు రాయలపేటలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలున్నాయి.

- నియోజకవర్గ జనాభా:3.50లక్షలు
- నియోజకవర్గంలో మొత్తం పంచాయతీలు:90

కొలమాసనపల్లెలో సిబ్బంది వైద్యసేవలే!

- పలమనేరు మండలంలోని కొలమాసనపల్లె పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులు ఉండాలి. ఓ డాక్టర్ ప్రసూతి సెలవులో ఉండగా మరో డాక్టర్ క్యాంపుకెళ్లారు. దీంతో శుక్రవారం మధ్యాహ్నం వరకు ఓపీకి 71మంది రాగా వీరికి అక్కడున్న సిబ్బందే వైద్యసేవలు అందించారు.
- ఇక్కడ ఉన్న నాలుగుబెడ్లలో రోగులుండగా డాక్టర్లు అందుబాటులో లేరు. వారికేమైనా అత్యవసరమైతే దిక్కు ఎవరనే మాట రోగుల సహాయకుల నుంచి వినిపించింది.
- ఇక్కడి ఆస్పత్రిలో మొత్తం ఇద్దరు వైద్యులు, 12మంది సిబ్బంది ఉండాలి. కానీ పీహెచ్‌ఎన్, సీనియర్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ముఖ్యంగా శానిటరీ అసిస్టెంట్ లేక రోగులకు ఇబ్బంది పడుతున్నారు.
- రోగులకోసం నిర్మించిన మల మూత్రశాలలు మూతబడ్డాయి. ఆస్పత్రి ప్రాంగణం పిచ్చిమొక్కలకు నిలయంగా మారింది.

వీ.కోట మండలంలో...

- వీ.కోట మండలంలోని ఓగు పీహెచ్‌సీలో పారిశుధ్యం లోపించింది. మురుగునీటి గుంతను కొన్నేళ్లుగా శుభ్రం చేయకపోవడంతో అందులో పురుగులు, దోమల లార్వాలు ఇబ్బడి ముబ్బడిగా కనిపిస్తున్నాయి.
- ఇద్దరు స్టాఫ్ నర్సుల కొరత వేధిస్తోంది. ఈ సమస్య రోగులపై చూపుతోంది.
- ఇక్కడ పారిశుధ్యం సమస్యల మూలాన రోగులు కొత్త వ్యాధుల బారిన పడే ప్రమాదం పొంచి ఉంది.


కొలమాసనపల్లె పీహెచ్‌సీ

మిగిలిన పీహెచ్‌సీల్లోనూ ఇదే పరిస్థితి

- పెద్దపంజాణి మండలంలోని రాయలపేట పీహెచ్‌సీలో సిబ్బంది పోస్టులు రెండు ఖాళీగా ఉన్నాయి.
- ఆస్పత్రి ప్రాంగణంలో పిచ్చిమొక్కలు మొలిచి అపరిశుభ్రంగా మారింది.
- ఇక బైరెడ్డిపల్లె మండల కేంద్రంలోని 24 గంటల ఆస్పత్రిలో ఎప్పుడు రోగులు వెళ్లినా వైద్యులు అందుబాటులో ఉండటం లేదనే విమర్శలొస్తున్నాయి.
- ఇక్కడ శానిటరీ అసిస్టెంట్లు ఇంజెక్షన్లు వేస్తున్నారంటే పరిస్థితిని ఎలా ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు.
- కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ ఆసుపత్రుల్లో పేదలకువైద్యసేవలు అరకొరగానే అందుతున్నాయనేది ప్రస్తుత పరిస్థితులు తేటతెల్లం చేశాయి.


ఆస్పత్రి వద్ద మొలిచిన పిచ్చిమొక్కలు


మూతబడిన మరుగుదొడ్లు


ఓగు పీహెచ్‌సీలో మురుగునీట దర్శనమిస్తున్న పురుగులు

- ఏచిన్న సమస్యతో ఆస్పత్రికెళ్లినా 108లో పలమనేరు ఏరియా ఆస్పత్రికి రెఫర్లు చేస్తుండటం గమనార్హం!

అపరిశుభ్రతకు నిలయంగా గంగవరం ఆస్పత్రి

- గంగవరం మండల కేంద్రంలోని ఆస్పత్రి అపరిశుభ్రతకు నిలయంగా మారింది.
- బాలింతల బెడ్లపక్కనే పనికిరాని వస్తువులు, కుళ్లిన పదార్థాలతో దుర్గంధం చిమ్ముతోంది.
- ఆస్పత్రిలోని మరుగుదొడ్లను వినియోగించకుండా వాటిని స్టోర్‌రూమ్‌గా వినియోగిస్తున్నారు.
- ఆస్పత్రి ప్రాంగణంలో పిచ్చిమొక్కలు పెరిగి దోమలకు ఆవాసంగా మారింది.
- గతంలో రోజువారీ ఓపీ 200 ఉండగా ఇప్పుడు 70 దాటడం లేదు.
- ఆస్పత్రిలో సిబ్బంది పోస్టులు రెండు ఖాళీగా ఉన్నాయి.


గంగవరం పీహెచ్‌సీలో పారవేసిన వస్తుసామగ్రి, పెరిగిన పిచ్చిమొక్కలు

క్లుప్తంగా

సచివాలయ సేవలు బోర్డులో ప్రదర్శించండి


రిజిస్టర్లను పరిశీలిస్తున్న జెడ్పీ చైర్మన్

బైరెడ్డిపల్లి: సచివాలయాల్లో ప్రజలకు అందిస్తున్న సేవలు బోర్డు రూపంలో కార్యాలయంలో ప్రదర్శించాలని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు ఆదేశించారు. శుక్రవారం ఆయన స్థానిక గ్రామ సచివాలయం-1ను ఆకస్మిక తనిఖీ చేశారు. వివిధ రిజిస్టర్లు, సీఎల్ ఎంట్రీలు, క్యాంపుల వివరాలను పరిశీలించారు. గ్రామాల్లో తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించి తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కేశవులు, సర్పంచ్ వెంకటేష్, కన్వీనర్ కార్తీక్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాజెక్టుకు చేరుతున్న వరద నీరు


సోమల మండలంలో గార్గేయనదీ ప్రవాహం

సదుం: మండల సరిహద్దులోని సోమల మండల అటవీ ప్రాంతంలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల మూలాన వాగులు, వంకలు పరుగులు తీస్తున్నాయి. వర్షపు నీటితో గార్గేయ నది ప్రవహిస్తూ మండలంలోని కొర్లకుంటవారిపల్లె ప్రాజెక్టుకు చేరుతోంది. మరి కొన్ని రోజులు ఇలాగే వర్షాలు కురిస్తే ప్రాజెక్టుకు జలకళతో తొణికిసలాడుతుందని ప్రజలు ఆశాభావంతో ఉన్నారు. ఇక, శుక్రవారం మధ్యాహ్నం మండలంలోని పలు ప్రాంతాలలో మోస్తరు వర్షం కురిసింది.

వర్షానికి నేలకొరిగిన వరి

కల్లూరు(పులిచెర్ల): తుపాను ప్రభావంతో కొన్ని రోజులుగా పులిచెర్ల మండలంలో కురుస్తున్న వర్షాలకు వరి పంట దెబ్బతింది. పంట చేతి కొచ్చే సమయంలో వర్షాలకు పైరు నేలకొరగడంతో నష్టపోయామని రైతులు వాపోయారు. అలాగే కూరగాయ పంటలు సాగు చేసిన భూముల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో కాయలు చెట్లలోనే కుళ్లిపోతున్నాయి.

అరుదైన శస్త్రచికిత్స


శస్త్ర చికిత్స చేస్తున్న వైద్యులు

కుప్పం రూరల్: కుప్పంలోని కేసీ ఆస్పత్రిలో మోకాళ్లకు అరుదైన శస్త్ర చికిత్స నిర్వహించినట్లు వైద్యులు మంజునాథ్ తెలిపారు. శుక్రవారం కుప్పానికి చెందిన 54 ఏళ్ల వ్యక్తికి అరుదైన ఫారిన్ ఇంప్లాంట్ శస్త్ర చికిత్స చేసినట్లు చెప్పారు. ఆ వ్యక్తి ఐదేళ్లుగా మోకాళ్ళ నొప్పితో బాధపడుతూ ఆస్పత్రికి వచ్చాడని మంజునాథ్ చెప్పారు. శుక్రవారం శస్త్ర చికిత్స చేసి కృత్రిమ మోకాళ్ల ఎముక (ఫారిన్ ఇంప్లాంట్) విజయవంతంగా అమర్చినట్లు ఆయన చెప్పారు. బెంగళూరు, చెన్నై వంటి మహా నగరాల్లోనే ఇలాంటి శస్త్ర చికిత్సలు చేస్తారని, తొలిసారి కుప్పంలో తక్కువ ఖర్చుతో ఈ చికిత్స చేశామని, రోగి ఆరోగ్యంగా ఉన్నట్టు ఆయన పేర్కొన్నారు.

లింగ నిర్ధారణ చేస్తే చర్యలు

- అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌వో వెంకటప్రసాద్

పలమనేరు: స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు లింగనిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు తప్పవని అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటప్రసాద్ హెచ్చరించారు. పీసీపీఎన్‌డీటీ చట్టంపై శుక్రవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, స్కానింగ్‌కోసం వచ్చే గర్భవతులకు కొందరు వైద్యులు రకరకాల సంకేతాలతో శిశువు మగ, ఆడా అని చెబుతున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇలాంటి వారిపై తొలిసారి రెండేళ్ల జైలుశిక్ష, రెండోసారి తప్పుచేస్తే రూ.50వేల జరిమానా, ఐదేళ్ల జైలుతోపాటు వారి వైద్య పట్టాను సైతం రద్దు చేస్తామని హెచ్చరించారు. పలమనేరు పట్టణంతోపాటు ఆయా మండలాలకు చెందిన వైద్యులు ఈ విషయాన్ని స్కానింగ్ సెంటర్ నిర్వాహకులకు స్పష్టం చేయాలన్నారు. సమావేశంలో డాక్టర్ మల్లికార్జున రెడ్డి, ఆర్ఎంఓ డాక్టర్ శారద, వలంటీర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఈరోజు

మండల సమావేశం

సదుం: మండల సాధారణ సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రాజశేఖర్ బాబు తెలిపారు. అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు హాజరు కావాలన్నారు.

విద్యుత్ అంతరాయం

పలమనేరు: పలమనేరు ట్రాన్స్‌కో పరిధిలోని పలమనేరు, బైరెడ్డిపల్లె, వీ.కోట, గంగవరం మండలాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు స్థానిక ట్రాన్స్‌కో ఏడీ చిన్నబ్బ శుక్రవారం తెలిపారు.

కుప్పం, గుడుపల్లె మండలాల్లో..

కుప్పం రూరల్: సబ్‌స్టేషన్ మరమ్మతుల పనుల దృష్ట్యా కుప్పం, గుడుపల్లె మండలాల్లో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు రెస్కో ఎండీ సోమశేఖర్ తెలిపారు.

అభ్యసన వైకల్యాలపై అవగాహన ర్యాలీ


పుంగనూరు: ర్యాలీ చేస్తున్న ఎంఈఓలు చంద్రశేఖర్‌రెడ్డి, రెడ్డెన్నశెట్టి, విద్యార్థులు


చౌడేపల్లె: ర్యాలీ నిర్వహిస్తున్న ఎంఈఓలు, భవిత కేంద్రం విద్యార్థులు, రొంపిచెర్లలో...




గుడుపల్లె: పిల్లల తల్లిదండ్రులతో నిర్వహిస్తున్న ర్యాలీ,


వీ.కోట: ర్యాలీ చేస్తున్న ఉపాధ్యాయులు

పుంగనూరు: స్థానిక భవిత సెంటర్‌లో శుక్రవారం నిర్దిష్ట అభ్యసనా వైకల్యాలపై అవగాహన కార్యక్రమం, అలాగే మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంఈవోలు చంద్రశేఖర్‌రెడ్డి, రెడ్డెన్నశెట్టి మాట్లాడారు. విద్యార్థుల్లో ఐదు రకాల అభ్యసన వైకల్యాలు ఉంటాయని, అలాంటి వారికి భవిత కేంద్రాల్లో ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్టు చెప్పారు.కార్యక్రమంలో హెచ్ఎం సుబ్రమణ్యం, స్పెషల్ టీచర్లు రాధిక, ఐఈఆర్‌పీలు వెంకట్రమణ, అరుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

చౌడేపల్లెలో..

చౌడేపల్లె: అభ్యసనా లోపాలను గుర్తించి భవిత కేంద్రాల్లో ప్రత్యేక ప్రతిభావంతులైన పిల్లలకు మెరుగైన శిక్షణ ఇస్తామని ఎంఇఓలు కేశవరెడ్డి, తిరుమలమ్మ తెలిపారు. నిర్దిష్ట అభ్యసన వైకల్యాలపై శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ, చదువులో వెనుకబడిన ప్రత్యేక ప్రతిభావంతులను గుర్తించి, వారు అభ్యసన వైకల్యాలను అధిగమించే దిశగా భవిత కేంద్రాల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఈఐడీఎస్ఎస్ బాలాజి, భవిత కేంద్రం ఉపాధ్యాయులు రామ్మోహన్, నరేష్ పాల్గొన్నారు.

అభ్యసన వైకల్యాలపై అవగాహన ర్యాలీ

రొంపిచెర్ల: నిర్దిష్ట అభ్యసన వైకల్యాలపై శనివారం రొంపిచెర్లలో అవగాహన ర్యాలీ నిర్వ హించారు. ఎంఈవో శ్రీనివాసులు మాట్లాడు తూ, దివ్యాంగులకు ప్రత్యేకంగా భవిత కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. దీని ద్వారా విద్యతోపాటు సంపూర్ణ ఆరోగ్యం కోసం తీసుకోవాల్సిన వాటి గురించి నేర్పిస్తున్నామన్నారు. పిల్లలను భవిత కేంద్రాలకు పిలుచుకుని వచ్చే వారికి కూడా రవాణా చార్జీలను చెల్లిస్తున్నామని, దివ్యాంగులను ప్రభుత్వం గురించి వారికి పరికరాలను ఉచితంగా అందించే ఏర్పాట్లు చేస్తుందన్నారు. దీనిని దివ్యాంగులు సద్వినియోగం చేసుకో వాలని కోరారు. కార్యక్రమంలో బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీదేవి, భవిత కేంద్రం ఉపాధ్యాయులు అములు తదితరులు పాల్గొన్నారు.

గుడుపల్లెలో..

గుడుపల్లె: వైకల్యం గల పిల్లలను గుర్తించి వారితో రాయించడం, మాట్లాడటంపై శుక్రవారం స్థానిక భవిత కేంద్రంలో తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంఈవో శ్రీదేవి మాట్లాడారు. స్కూళ్లలో చదువుతున్న నిర్దిష్ట అభ్యసన వైకల్యం కలిగిన పిల్లలు చూడడానికి సాధారణ పిల్లల్లా ఉన్నప్పటికీ చదడం, రాయడంలో సమస్యలు ఎదుర్కొంటున్నారని, అలాంటి వారిని గుర్తించి వారికి తగిన శిక్షణ ఇవ్వనున్నట్టు చెప్పారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు.

వీ.కోటలో..

వీ.కోట: ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభ్యసన వైకల్యాలపై అవగాహన కలిగి ఉండాలని ఎంఈఓ మురుగేష్ అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రపంచ డిస్లెక్సియా వారం ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. డిస్లెక్సియాతో బాధపడుతున్న పిల్లలను గుర్తించి వారికి మెరుగైన విద్యను అందించడమే ఈ కార్యక్రమం ముఖ్యోద్దేశమన్నారు. కార్యక్రమంలో జెడ్పీ హెచ్ఎస్ (బాలుర) హెచ్ఎం పరశురాములు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై మొగ్గు చూపండి




పలమనేరు: మొరంలో ప్రకృతి వ్యవసాయాన్ని పరిశీలిస్తున్న అధికారులు, పెద్దపంజాణి: రాజుపల్లెలో..




శాంతిపురం: శివకురుబూరు వద్ద రాగి పంటను పరిశీలిస్తున్న అధికారులు, కల్లూరు: ఎల్లంకివారిపల్లెలో..

- జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ

పలమనేరు: రైతులు ప్రకృతి వ్యవసాయంపై మొగ్గు చూపాలని జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ కోరారు. శుక్రవారం మొరం పంచాయతీలో పొలం పిలుస్తోంది నిర్వహించారు. గ్రామానికి చెందిన సరసమ్మ చేస్తున్న ప్రకృతి వ్యవసాయాన్ని పరిశీలించారు. అనంతరం అక్కడి రైతు సేవా కేంద్రంలో రైతులకు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, రైతులు పురుగు మందులు, రసాయనిక ఎరువులు వాడకుండా ప్రకృతి వ్యవసాయం చేయాలన్నారు. మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు నివారణకు తీసుకోవాల్సిన చర్యలను స్థానిక ఏడీ అన్నపూర్ణదేవి వివరించారు. వర్షాల మూలాన వరి రంగు మారకుండా ఉప్పునీటిని పంటపై పిచికారీ చేయాలన్నారు. వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు, వ్యవసాయాధికారిణి సంధ్య, జిల్లా వనరుల కేంద్ర అధికారి విజయశంకర్ రెడ్డి, పలువురు రైతులు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

శాంతిపురం: రైతులు సమగ్ర సస్యరక్షణ విధానాన్ని పాటిస్తూ పంటల సాగులో రసాయన మందులు, ఎరువుల వినియోగం క్రమంగా తగ్గించాలని మండల వ్యవసాయాధికారి అప్పోజి కోరారు. శుక్రవారం కెనమాకులపల్లె, శెట్టిగానికురుబూరు గ్రామాల్లో రైతులతో కలిసి రాగి, వరి పంటలను పరిశీలించి ఆయన మాట్లాడారు. ఉద్యానవన అధికారి వింధ్య, సెరికల్చర్ అధికారి రవీంద్రరెడ్డి, హార్టికల్చర్ అసిస్టెంట్ మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.

రాజుపల్లెలో..

పెద్దపంజాణి: మండలంలోని రాజుపల్లె రైతు సేవా కేంద్రంలో శుక్రవారం 'పొలం పిలుస్తోంది' నిర్వహించారు. పట్టు పరిశ్రమ శాఖ ఏఎస్ఓ చౌదరి తమ శాఖ అమలు చేస్తున్న పథకాలను, సెరికల్చర్ సాగులో చేపట్టాల్సిన మెలకువలను రైతులకు వివరించారు. అలాగే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడికి తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. వీఎస్ఏ బాలాజి, అనిల్, మహేష్, శీనా, భానుప్రతాప్ రెడ్డి, బాలకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పులిచెర్ల మండలంలో..

కల్లూరు(పులిచెర్ల): పంటల సాగులో కలుపు నివారణతో అధిక దిగుబడులు పొందవచ్చని మండల వ్యవసాయశాఖాధికారి శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని ఎల్లంకివారిపల్లె, 106 రామిరెడ్డిగారిపల్లె పంచాయతీల్లో పొలం పిలుస్తోంది నిర్వహించి మాట్లాడారు. సిబ్బంది అఖిల, విజయ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

రొంపిచెర్ల: మండలంలో మోటుమల్లెల గ్రామ పంచాయతీలోని అంగన్‌వాడీ కేంద్రాలను ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని గర్భవతులు, బాలింతలు, పిల్లలకు క్రమం తప్పకుండా ఇవ్వాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో పిల్లల సంఖ్యను పెంచాలని ఆదేశించారు. పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించి అంగన్‌వాడీలను బలోపేతం చేయాలన్నారు. మోటుమల్లెల నగిరి, బాలనాగిరెడ్డిగారిపల్లె అంగన్‌వాడీలను తనిఖీ చేసి సిబ్బందితో మాట్లాడారు. అలాగే మోటుమల్లెల నగిరి, బాలనాగిరెడ్డిగారిపల్లె ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

న్యాయం చేయండి సారూ..!



చౌడేపల్లె: ప్రభుత్వం కొన్నేళ్ల క్రితం పట్టాలిచ్చిందని, వాటిలోనే సాగు చేస్తూ జీవిస్తున్న తమకు న్యాయం చేయాలంటూ తహసీల్దార్ హనుమంతు నాయక్‌కు శుక్రవారం పెద్ద కొండామర్రికి చెందిన లక్ష్మమ్మ, వెంకటలక్ష్మి, జ్యోతమ్మ తదితరులు వినతి పత్రం ఇచ్చారు. నాగిరెడ్డిపల్లె సమీపంలోని గోవిందురాజుల చెరువు సమీపంలో తమకు పట్టాలిచ్చారన్నారు. ఇటీవల కొందరు ఆ స్థలం తమదంటూ తమ పొలంలోకి వస్తున్నారని, దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్త చేశారు. తమకు న్యాయం చేయాలని, తమ పొలం తమకే చెందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

సీసీ, బీటీ రోడ్లకు భూమిపూజ

వి.కోట: పల్లె పండుగ-పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం సీసీ రోడ్లు, బీటీ రోడ్లకు ఈఈ పీఆర్ చంద్రశేఖర్‌రెడ్డి భూమిపూజ చేశారు. ఉపాధి హామీ పథకం కింద మంజూరైన బీసీపల్లె పంచాయతీ లింగాపురంలో రూ.42 లక్షలతో సీసీ రోడ్లు, చింతమాకులపల్లె పంచాయితీ గొల్లపల్లెలో రూ.9లక్షలతో సీసీ రోడ్లు, గొల్లపల్లె నుంచి బండపల్లె వరకు రూ.50 లక్షలతో బీటీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేసినట్లు ఆయన తెలిపారు. ఏఈపీఆర్ శ్రీనివాస్, ఏపీఓ అశోక్‌రెడ్డి, సర్పంచ్ రామచంద్ర, నాయకులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన

- రైతు సేవా కేంద్రాల్లో బోర్డులు ఏర్పాటు చేయాలని ఏడీఏ ఆదేశం


కొండామర్రి రైతు సేవా కేంద్రంలో అవగాహన కల్పిస్తున్న ఏడీఏ శివకుమార్

చౌడేపల్లె: రైతు సేవా కేంద్రాల్లో సమాచార బోర్డులను ఏర్పాటు చేయాలని వ్యవసాయశాఖ సహాయ పథక సంచాలకులు శివకుమార్ ఆదేశించారు. శుక్రవారం చౌడేపల్లెలో వీఏఏలకు సమావేశం, కొండామర్రి రైతు సేవా కేంద్రంలో గ్రామస్తులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సమాచార హక్కు చట్టంపై ఏడీఏ అవగాహన కల్పించారు. సమాచారం కోరిన వెంటనే నిర్ణీత గడువులోపు అర్జీదారుడి అభ్యర్థన మేరకు వివరాలివ్వాలని ఆదేశించారు. రైతు సేవా కేంద్రాల్లో సమాచార బోర్డుతో పాటు కార్యాలయానికి సంబంధించిన వివరాలన్నీ బోర్డులో ప్రదర్శించాలన్నారు. అనంతరం ఈ-క్రాప్ నమోదు, వర్షపాతం, పంట నష్టం వివరాలపై ఆరా తీశారు. కొత్త పంటల సాగుపై రైతులు దృష్టిసారించేలా అధికారులు చైతన్యం కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ జ్యోతమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీపీ తీరుపై ఎంపీటీసీలు గరం..గరం

- మండల సమావేశానికి జెడ్పీటీసీ సహా 9మంది ఎంపీటీసీలు గైర్హాజర్
- వైఎస్సార్‌సీపీ ఎంపీపీగా ఉంటూ టీడీపీకి మద్దతా? అని అసంతృప్తి
- ప్రభుత్వ ఆఫీసుల వద్ద తొలగించని కూటమి బ్యానర్ల మూలాన చిచ్చు


ఎంపీపీ రెడ్డెప్ప

పెద్దపంజాణి: ఎంపీపీ రెడ్డెప్ప తీరుపై వైఎస్సార్‌సీపీకి చెందిన జెడ్పీటీసీతోపాటు పలువురు ఎంపీటీసీలు గుర్రుమన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వ సభ్య సమావేశం దీనికి వేదికైంది. మండలంలో మొత్తం 17మంది ఎంపీటీసీలున్నారు. వీరిలో 16మంది వైఎస్సార్‌సీపీకాగా, ఒక్కరు మాత్రం టీడీపీ ఎంపీటీసీ ఉన్నారు. దీంతో ఎలా చూసుకున్నా వైఎస్సార్‌సీపీకే మండల సమావేశం నిర్వహించే సత్తా ఉంది. ఈ నేపథ్యంలో శుక్రవారం మండల సమావేశానికి వైఎస్సార్‌సీపీకి చెందిన 9మంది ఎంపీటీసీలు, జెడ్పీటీసీ హాజరు కాలేదు. ఏడుగురు వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు, ఓ టీడీపీ ఎంపీటీసీ హాజరయ్యారు. కోరం ఉండడంతో ఎంపీడీఓ బాలాజీ సమావేశం నిర్వహించారు. గత మండల సమావేశంలో పలువురు వైఎస్సార్‌సీపీ సభ్యులు...మండల కేంద్రంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఉన్న కూటమి బ్యానర్లను తొలగించాలని ఎంపీపీ ద్వారా అధికారులకు విజ్ఞప్తి చేశారు. కానీ ఇప్పటివరకూ వాటి జోలికి వెళ్లకపోవడంతో ఎంపీటీసీలకు ఆగ్రహం తెప్పించింది. తమ పార్టీ ఎంపీపీగా ఉంటూ కూటమికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని పలువురు ఎంపీటీసీలు మండల సమావేశానికి గైర్హాజరై పరోక్షంగా నిరసన వ్యక్తం చేశారు.

గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు


చిట్రెడ్డిపల్లెలో గొర్రెలకు నట్టల నివారణ మందును తాగిస్తున్న వైద్యాధికారి పవన్‌కుమార్

చౌడేపల్లె: డీవార్మింగ్ (నట్టల నివారణ మందు)తో గొర్రెలు, మేకల్లో రక్తహీనతను నివారించడం సాధ్యమని పశువైద్యాధికారి పవన్‌కుమార్ అన్నారు. శుక్రవారం చిట్రెడ్డిపల్లెలో మూగజీవాలకు నట్టల నివారణ మందులు తాగించారు. ఆయన మాట్లాడారు. ఈనెలాఖరుకు ఉచితంగా నట్టల నివారణ మందులను గొర్రెలు, మేకలకు వేస్తామన్నారు. మండలానికి 47 వేల డోసుల మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. అంతర పరాన్న జీవులు, కాలేయం, ఊపిరితిత్తులు, జీర్ణాశయం మెదడు మొదలైన అవయవాల్లో తిష్ట వేసి, రక్తహీనతకు గురిచేస్తాయని, వీటి బారిన నుంచి మూగజీవాలను సంరక్షణకు నట్టల నివారణ మందులు విధిగా వాడాలని కోరారు. రైతు సేవా కేంద్రాలు, వెటర్నరీ సిబ్బంది సహకారంతో ప్రతి రైతుకు ఇవి అందేలా చర్యలు తీసుకున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో సిబ్బంది జానకిరామ్, రెడ్డిప్రసాద్ పాల్గొన్నారు.